క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో భ్రమరాంబికాదేవికి బోనాలు



బోనాలతో బయలుదేరిన మహిళలు

జూపాడుబంగ్లా: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని తూడిచెర్ల గ్రామానికి మహిళలు భక్తిశ్రద్ధలతో భ్రమరాంబిక అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. గ్రామం నుంచి మేళతాళాలతో బయలుదేరిన మహిళలు ఆలయం చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

డివిజన్ మహాసభలను జయప్రదం చేయండి

నందికొట్కూరు: భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ(ఐక్య) నందికొట్కూరు డివిజన్ మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కన్వీనర్ లాజరస్ కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తపల్లి మండలం సంగమేశ్వర పుణ్యక్షేత్రం సమీపంలోని గిరిజన తండలో మార్చి 2న జరిగే డివిజన్ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు శ్రీనివాసులు, మద్రిస్వామి, కృష్ణ, నాగలక్ష్మి, రోజమ్మ, కుమార్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నీటి ట్యాంకు విరాళం



నీటి ట్యాంకును అందజేస్తున్న మగ్బూల్

ఆత్మకూరు: స్థానిక ఎస్ఆర్‌బీసీ కాలనీలోని మానవతా నిలయానికి (వృద్ధాశ్రమం) 5 వేల లీటర్ల సామర్థ్యం ట్యాంకును ఆత్మకూరుకు చెందిన ఎస్.మగ్బూల్, వారి బృందం విరాళమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ మిత్రుని కుమారుడి పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమానికి నీటి ట్యాంకును విరాళంగా ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు యుగంధర్ పాల్గొన్నారు.

మార్చి 4న జాబ్ మేళా



కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

నందికొట్కూరు: వచ్చే నెల 4న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా ఉంటుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా కరపత్రాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీతతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ కోఆర్డినేటర్ వెంకటరమణ పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలనకు మహిళలు సహకరించాలి



అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా

నందికొట్కూరు: నాటు సారా నిర్మూలనకు మహిళలు సహకరించాలని ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రుల్లా కోరారు. గురువారం సమగ్ర శిశు సంక్షేమ కార్యాలయంలో సీడీపీఓ కోటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన నహోదయ 2.0 నాటు సారా నిర్మూలన గురించి అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా రహిత పట్టణంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు మంగవల్లి, సూపరువైజర్లు వరలక్ష్మి, వెంకటేశ్వరి, రమణమ్మ, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కుమారి పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి

జూపాడుబంగ్లా: ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని తంగడంచ గ్రామంలో కందిపంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల్లో వ్యాపించే పురుగు, తెగుళ్ల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలంలో పురుగు ఉధృతిని నివారించేందుకు బ్లూ, ఎల్లో కార్డులు ఏర్పాటు చేసుకోవాలని, పొలంగెట్ల వెంట బంతిపూలను సాగుచేసుకోవాలని సూచించారు. వేపమందుతోపాటు జీవరసాయనిక మందులు పంటలపై పిచికారీ చేసుకోవాలన్నారు. అధికమోతాదులో రసాయనిక మందులు పిచికారీ చేయటం, బస్తాలకొద్దీ ఎరువులు వేయటం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. రబీ సీజన్‌కు పంటలు సాగుచేసిన రైతులు మార్చి 3 లోపు రైతుసేవా కేంద్రాల్లో పంట నమోదు చేయించుకుని, ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

పార్వతీపరమేశ్వరుల కల్యాణం చూతము రారండి

● కల్యాణానికి తరలివచ్చిన భక్తులు



పార్వతీ పరమేశ్వరులకు కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఉత్సవమూర్తుల విగ్రహాలపై తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

ఆత్మకూరు: వెంకటాపురం క్షేత్రంలో వెలిసిన శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గురువారం స్వామి అమ్మవార్లను పెళ్లి కుమార్తె, పెళ్లి కుమారుడిగా ముస్తాబు చేసి వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ముత్యాల రత్నాల తలంబ్రాలు, మంగళవాయిద్యాల మధ్య జరిని శివపార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం గ్రామంలో ఉత్సవమూర్తులను ఊరేగించారు.

సంగమేశ్వరుడి కల్యాణం..

కొత్తపల్లి: సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఎగువ పుష్కరఘాట్ ఉమామహేశ్వరాలయ ప్రాంగణంలో లలితా సంగమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు తెలకపల్లి రఘురామ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. దేవతా మూర్తుల విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి ఒడిబియ్యం, జీలకర్ర బెల్లం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లలితా సంగమేశ్వరస్వామి వార్ల విగ్రహాలకు మాంగళ్యధారణ, తలంబ్రాల కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సాయిబాబా పేటలో..

నందికొట్కూరు: పట్టణంలోని సాయిబాబా పేటలోని శివాలయంలో లింగోద్భవ అనంతరం బుధవారం అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవారి కల్యాణ వేడుకను చూసి తరించారు.



ఓంకారంలో స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

ఓంకారంలో భక్తుల రద్దీ

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఓంకార క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పంచ బుగ్గల కోనేరులో పుణ్య స్నానాలు చేసి, ఓంకార సిద్ధేశ్వర స్వామిని, అమ్మ వారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. తర్వాత వ్యాస మహర్షి ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసి, నల్లమల కొండపై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను సందర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో గంగా ఉమా సమేత ఓంకారేశ్వరున్ని నంది వాహనంపై కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు.



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

ముత్యాల తలంబ్రాలతో మురిసిన మహానందీశుడు

మహానంది: స్థానిక కల్యాణ మండపం వద్ద మహానందీశుడి దంపతుల కల్యాణం గురువారం కనులపండువగా సాగింది. వేలాది భక్తజనం వధూవరులైన మహానందీశ్వరుడి దంపతులకు ముత్యాల తలంబ్రాల అక్షింతల వేసి తరించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, ముఖ్య అర్చకులు రాఘవశర్మ, పండితులు, రుత్వికుల బృందం వధూవరులను అలంకార మండపం నుంచి తీసుకొస్తూ రాజగోపురం ముందు ఎదురుకోళ్ల ఉత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణవేదిక వద్ద మాంగల్య ధారణ పూజలు చేపట్టారు. వరుడు మహానందీశ్వరస్వామి తరపున గుండంపాడుకు చెందిన శివరామిరెడ్డి, రమాదేవి, కుటుంబ సభ్యులు, వధువు కామేశ్వరీదేవి తరపున గుండుపాపలకు చెందిన ముక్కమల్ల ప్రహ్లాదరెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు పెళ్లి పెద్దలుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ విశ్వనాథ్, ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, దేవిక, ఆలయ ఇన్‌స్పెక్టర్లు శ్రీశైలం చిన్నా, మహానంది శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహానందీశ్వరుడి దంపతులకు కల్యాణోత్సవం



స్వామివారి రథాన్ని మేళతాళాలతో గ్రామపురవీధుల్లో తిప్పుతున్న భక్తులు

రమణీయం.. కాశీవిశ్వేశ్వరుడి రథోత్సవం

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలో కాశీవిశ్వేశ్వరస్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. గురువారం అర్చకులు ఉమామహేశ్వరశర్మ వేదమంత్రాల మధ్య కాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణమాత ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి రథంపై కొలువుంచారు. రథానికి బలిహారతినిచ్చి ముందుకు కదిలించారు. భక్తులు హరహర మహదేవ.. శంభోశంకర నినాదాలు, మేళతాళాల మధ్య స్వామివారి రథాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు సమర్పించి కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

రసవత్తరంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు



మహానందిలో..

బండి ఆత్మకూరు: మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా మండల పరిధిలోని ఓంకారం, విష్ణు నందిలో ఏర్పాటు చేసినఎడ్ల బండ లాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. గురువారం ఓంకారం, శివనంది, విష్ణు నంది క్షేత్రాల్లో రాష్ట్ర స్థాయి పాల దూడలు, న్యూ కేటగిరీ విభాగంలో పోటీలు నిర్వహించారు. విష్ణు నంది క్షేత్రంలో నిర్వహించిన ఆరుపళ్ల విభాగం ఎండ్ల బండలాగుడు పోటీల్లో పది జతల ఎడ్లు పాల్గొన్నాయి. నొస్సం మండలానికి చెందిన కొనిదల హరినాథ్ రెడ్డి ఎద్దులు విజేతగా నిలిచి రూ.30 వేల నగదు బహుమతి దక్కించుకున్నాయి. మిడుతూరు మండలం రోళ్లపాడుకు చెందిన పేరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.20 వేలు, పెసరవాయి గ్రామానికి చెందిన గిత్తా నాగేశ్వరరావు ఎద్దులు తృతీయ స్థానంలో నిలిచి రూ.15 వేలు, ఒంటిలగల గ్రామానికి చెందిన ప్రమీలమ్మ ఎద్దులు నాలుగవ స్థానంలో నిలిచి రూ.10, సింగవరం గ్రామానికి చెందిన మస్తాన్ ఎద్దులు ఐదవ స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు బహుమతులు గెలుపొందాయి.

● **మహానంది:** మహానందిలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి వృషభాల పోటీలను గురువారం మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్ ప్రారంభించారు. నంద్యాల జిల్లా బోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణకు చెందిన సుంకి సురేంద్రరెడ్డి వృషభాలు సంయుక్త విజేతగా నిలిచి రూ.1.25 లక్షలు, శిరివెళ్ల మండలం గుంప్రమానుదిన్నెకు చెందిన కందూరు రాంభూపాల్‌రెడ్డి వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.80 వేలు సొంతం చేసుకున్నాయి.

పచ్చి రొట్ట ఎరువులతో భూసారం పెంపు

● ఏడీఏ ఆంజనేయ



మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

పాములపాడు: పచ్చి రొట్ట ఎరువును ఉపయోగిస్తే భూసారం పెరుగుతుందని ఏడీఏ ఆంజనేయ సూచించారు. గురువారం మండలంలోని మద్దూరు, వాడాలా గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పంట మార్పిడి చేయకపోతే దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని, ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం మొక్కజొన్న, జొన్న, మినుము పంటలను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ఫణీశ్వర్ రెడ్డి ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

నందికొట్కూరు: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పండించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వైవీ మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పొలిమేరలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మినుము, శనగ, పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. శనగ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వేసవి దుక్కులు పంటలకు ఎంతో రక్షణ ఇస్తుందన్నారు. జీగురు అట్టలు, పచ్చిరొట్ట ఎరువులను వేసుకోవాలని సూచించారు. మినుము, శనగ పంటలను ఆశించిన లద్దె పురుగు, కాయ తొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట ఏడీఏ జయశేఖర్ ఉన్నారు.

● **పగిడ్యాల:** మండల కేంద్రం పరిధిలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం చేపట్టిన రైతు వెంకటేశ్వర్లును అభినందించారు. 35 రకాల పంటలతో నిరంతరం ఆదాయం వచ్చే ఆకుకూరలు, కూరగాయలు పండించడం ఆదర్శనీయమన్నారు. మిగతా రైతులు కూడా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పండించాలని సూచించారు. క్రిమిసంహారక మందులతో పండించిన పంట ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉండదన్నారు. రైతు విశిష్ట గుర్తింపు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో డీఏఓ ఆఫ్రీన్, ఏఈఓలు రాము, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● **కొత్తపల్లి:** కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారిణి హేమలత సూచించారు. గురువారం కొక్కెరంచ, దుద్యాల గ్రామాల్లో కందిపంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉన్నందున మచ్చల పురుగు నివారణకు నోవాల్యూరాన్, ఇండాక్సా కార్బ్, స్పైనోసాడ్ మందులను పిచికారీ చేసుకోవాలని సూచించారు. పాడి పంటలు మాసాంతపు పత్రికకు రైతులు ఏడాది చందా రూ.300 చెల్లించాలని రైతులకు సూచించారు. ఇందులో వ్యవసాయ అనుబంధ రంగాల సాంకేతిక పరిజ్ఞానం, నూతన వంగడాలు, పంటల యాజమాన్య పద్ధతులు ఉంటాయన్నారు. సొంత భూమి కలిగిన రైతులు రైతువిశిష్ట సంఖ్య పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.మహేష్ పాల్గొన్నారు.

లుంగీ మాటున బ్యాగు చోరీ



లుంగీలో బ్యాగును పెట్టుకుని తీసుకెళ్తున్న దొంగ

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం ఎల్లార్తికి చెందిన లక్ష్మీకాంతరెడ్డి, విష్ణు కుటుంబ సభ్యులు గురువారం మహానందికి వచ్చారు. చిన్న కోనేరులో స్నానాలకు వెళ్తూ వారి దుస్తులను పక్కనే ఉన్న జువ్విచెట్టు అరుగుపై పెట్టారు. నలుగురు దొంగలు తెలివిగా వస్త్రాలు మార్చుకుంటున్నట్లు నటిస్తూ ముందు ఒకడు అరుగుపైకి వెళ్లి లుంగీ మాటున డ్రాయర్ మార్చుకుంటున్నట్లు నటించి క్షణంలో బ్యాగును తస్కరించగా మిగిలిన ముగ్గురు కవర్ చేస్తూ వచ్చారు. బాధిత భక్తులు బయటికి వచ్చి చూసుకోగా బ్యాగు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాగులో రూ.28 వేల నగదు, ట్యాక్సీ తాళాలు ఉన్నాయని బాధితులు తెలిపారు. కాగా చోరీ దృశ్యం సీసీ కెమెరాలో నమోదైంది.

సర్వేలను పూర్తి చేయాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాములపాడు: గ్రామాల్లో సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని వానాల గ్రామంలో పీ-4 ఇంటింటి సర్వేను పరిశీలించారు. మద్దూరు గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

అంబేడ్కర్, భగత్‌సింగ్ ఫొటోల తొలగింపు తగదు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పాములపాడు: ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, భగత్‌సింగ్ ఫొటోలు తొలగించడం తగదని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి అంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.షేక్షావలి, వైఎస్సార్‌సీపీ కో–ఆప్టెడ్ మెంబర్ మూర్తుజావలి అన్నారు. గురువారం వారు మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, స్వాతంత్ర సమర యోధుడు భగత్‌సింగ్ చిత్రపటాలను తొలగించి పీఎం నరేంద్రమోదీ, రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఫొటోలను ఏర్పాటు చేయడం భారతీయులందరికీ అవమానకరమన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు తిరుపతయ్య, సాయికృష్ణ, శెట్టి శివలింగం, ఎం.వెంకటరమేష్, ఎస్.నాగరాజు, కే.రాజశేఖర్, కలబండి గోపాల్, జి.రవికుమార్, సయ్యద్. మహబూబాషా, రామసముద్రం నాగరాజు, దయామయుడు, కె. జక్కయ్య పాల్గొన్నారు.

వాణిజ్య సముదాయంలో భక్తుల రద్దీ



మల్లన్నా.. మళ్లీ వస్తాం!

● తిరుగు పయనమైన భక్తులు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వేలాదిగా తరలివచ్చిన భక్తులు బుధవారం రాత్రి పాగాలంకరణ, లింగోద్భవ కాల మహాన్యాసపర్వక ఏకదశ రుద్రాభిషేకం, స్వామిఅమ్మవార్ల కల్యాణం కనులారా తిలకించారు. గురువారం సాయంత్రం జరిగిన రథోత్సవాన్ని కనులారా తిలకించిన భక్తులు తమ సొంత గ్రామాలకు తిరుగు పయనమయ్యారు. వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలకు మళ్లీ వస్తామంటూ బయలుదేరి వెళ్లారు. సొంత గ్రామాలకు వెళ్లే భక్తులు వాణిజ్య సముదాయంలో గృహోపకరణ వస్తువులు, పిల్లలకు ఆట వస్తువులు, ప్రసాదాలు, స్వామిఅమ్మవార్ల చిత్రపటాలు, ఇతర వస్తువులను కొనుగోలు చేసుకుని వెళ్లారు. భక్తుల రద్దీతో వాణిజ్య సముదాయంలోని దుకాణాలు కిక్కిరిశాయి.